మహబూబాబాద్ కలెక్టరేట్ ముందు కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి శోభన్

కావాలనే విధుల నుంచి తొలగించారు

- పశుసంవర్ధక శాఖ అధికారులపై ఔట్‌సోర్సింగ్ అటెండర్ ఆరోపణ
- న్యాయం చేయాలని మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన

మహబూబాబాద్ రూరల్, జూలై 8 : తనను కావాలనే విధుల్లో నుంచి తొలగించారని పశుసంవర్ధక శాఖలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన అటెండర్‌గా పనిచేసిన సలుగు శోభన్ ఆరోపించారు. సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం కొమ్ములవంచ గ్రామానికి చెందిన తాను 2006 నుంచి నెల్లికుదురు మండల పశుసంవర్ధక కార్యాలయంలో అటెండర్‌గా పనిచేశానన్నాడు. 2020లో లోకల్, నాన్ లోకల్ కేటగిరీ చూపి ఉద్యోగం నుంచి తొలగించారని, మళ్లీ రెండు నెలలకే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం జీవో జారీ చేసిందని తెలిపారు. అయితే మహబూబాబాద్ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మాత్రం మూడేళ్లుగా డైరీ డిప్లొమా కోర్స్ చదివి ఉండాలని సాకు చూపుతూ తనను విధుల్లోకి తీసుకోవడం లేదని, రాష్ట్రంలోని ఏ జిల్లాలో కూడా ఇలా లేదని అన్నారు. తాను లోకల్ అని, ఇంటర్మీడియట్ డైరీ సైన్స్ అర్హత కలిగి ఉన్నప్పటికీ విధుల్లోకి తీసుకోవడం లేదని ఆరోపించారు. దీనిపైనే ఆధారపడి కుటుంబ పోషణ కొనసాగిస్తున్నానని, వెంటనే తనను విధుల్లోకి తీసుకునేలా కలెక్టర్ చూడాలని బాధితుడు కోరారు.

ఆ ముగ్గురిపైనే చర్చ..

- ఇన్‌చార్జి వీసీ, వేం, వెంకటేశంను కలిసిన కేయూ పాలకమండలి సభ్యులు
- ఈసీ నియామకం జీవోను వెంటనే రద్దు చేయాలి

హనుమకొండ చౌరస్తా, జూలై 8 : కాకతీయ యూనివర్సిటీ పాలకమండలిలో నియామకమైన ఆ ముగ్గురిపైనే చర్చ జరిగినట్లు సమాచారం.. సోమవారం 'నమస్తేతెలంగాణ'లో 'కేయూ ఈసీపై వివాదం' అనే కథనం ప్రచురితం కావడంతో పాలకమండలిలో సభ్యులైన యూనివర్సిటీ లా కాలేజీకి చెందిన డాక్టర్ ఎన్ సుదర్శన్, కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన బొద్దిరెడ్డి రమ, ఆర్ట్స్ కాలేజీ తెలుగు విభాగంలో ఒప్పంద అధ్యాపకుడిగా పనిచేస్తున్న చిర్ర రాజు నియామకంపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పాలకమండలి సభ్యులు సోమవారం కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశంను కలిశారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నుంచి ఆ ముగ్గురి నియామకాన్ని రద్దు చేయాలని యూనివర్సిటీ ప్రొఫెసర్లు, మేధావులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని వివరించారు. అలాగే డాక్టర్ వినితారెడ్డి సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో కలిసి ఈసీ నియామకానికి సంబంధించిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

డ్రాగన్ ఫ్రూట్‌లో పురుగులు

రిలయన్స్ ఫ్రెష్‌పై కన్జ్యూమర్ ఫోరంలో ఫిర్యాదు

కాశీబుగ్గ, జూలై 8: నగరంలోని పుప్పాలగుట్ట ప్రాంతానికి చెందిన ఎల్ శ్రీనివాస్ ఈ నెల 6వ తేదీ సాయంత్రం పోచమ్మమైదాన్‌లోని రిలయన్స్ ఫ్రెష్‌లో నిత్యావసర సరుకులతోపాటు డ్రాగన్ ఫ్రూట్స్ కొనుగోలు చేశాడు. అదేరోజు రాత్రి ఇంటికి వెళ్లి కవర్ కట్ తెరిచి చూడగా అందులో చీమలు, పురుగులున్నట్లు గుర్తించాడు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఒరిజినల్ బిల్లుతో పాటు వాటి ఫొటోలతో జిల్లా కన్జ్యూమర్ ఫోరం ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

కన్జ్యూమర్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస్

అవసరమైన మందులు, పరికరాలు అందజేస్తాం

- ఎంజీఎం ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థల ఎండీ హేమంత్
- సూపరింటెండెంట్, ప్రొఫెసర్లు, వైద్యులతో సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న హేమంత్ సహదేవ్‌రావు

కాశీబుగ్గ, జూలై 8 : ఉత్తర తెలంగాణకే పెద్ద దిక్కైన ఎంజీఎంకు అవసరమైన మందులతో పాటు సర్జికల్ వైద్య పరికరాలను అందజేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ సహదేవ్‌రావు అన్నారు. సోమవారం ఎంజీఎం కాన్ఫరెన్స్ హాల్లో ఆస్పత్రికి అత్యవసరంగా అవసరమయ్యే మందులు, వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలపై సూపరింటెండెంట్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, ఫార్మసీ డిపార్ట్‌మెంట్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీ చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్య పరికరాలు, మందులు, ల్యాబ్ కెమికల్స్ తదితరాలను సకాలంలో పంపిణీ చేయాలని కోరారు. ప్రత్యేకంగా బయో మెడికల్ ఇంజినీర్‌ను నియమించాలని కోరారు. గత రెండేళ్లలో ఎంజీఎంలో వినియోగించిన ఔషధాలు, సర్జికల్స్ ఆధారంగా భవిష్యత్‌లో సరఫరా చేస్తామన్నారు. వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు వారికి కావాల్సిన వైద్య పరికరాలు, మందులు సరఫరా చేయాలని కోరారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కౌటిల్య మాట్లాడుతూ అత్యవసరమైన ఇండెంట్లను వైద్య విద్య సంచాలకుల ద్వారా పంపిస్తే సకాలంలో సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చీఫ్ ఇంజినీర్ దేవేంద్రకుమార్ మాట్లాడుతూ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వైద్యులు రాంకుమార్‌రెడ్డి, మురళి, ప్రసాద్, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ రాజేశ్, సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ఇన్‌చార్జి ఫార్మాసిస్టు ఉప్పుల భాస్కర్‌రావు, ఎంజీఎం ఫార్మసీ ఇన్‌చార్జి పద్మావతి పాల్గొన్నారు.

బయో వీతో నిట్ ఎంవోయూ

బయో వీ ఎండీతో ఒప్పందం చేసుకుంటున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ చౌరస్తా, జూలై 8 : వ్యవసాయ సొల్యూషన్స్ ఉత్పత్తులను అందించే బయోటెక్నాలజీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీ అయిన బయో వీతో వరంగల్ నిట్ ఎంవోయూ కుదుర్చుకుంది. నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, బయో వీ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్ అవగాహన ఒప్పందం మార్చుకున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీకి చెందిన ఫ్యాకల్టీ, విద్యార్థులు బయో వీ సహకారంతో పని చేయొచ్చని, ఇంటర్న్‌షిప్‌లను కొనసాగించొచ్చని బిద్యాధర్ సుబుధి తెలిపారు. నిట్ ఆర్ అండ్ డీ డీన్ ప్రొఫెసర్ వీటీ సోమశేఖర్, బయోటెక్నాలజీ విభాగ ఇన్‌చార్జి హెడ్ ప్రొఫెసర్ సతీశ్‌బాబు, బయో వీ నుంచి తరుణ్, డాక్టర్ బెన్ హాజరయ్యారు.

క్యాంపస్‌ను సందర్శించిన టోక్యో వర్సిటీ ప్రొఫెసర్లు

సింగపూర్‌లోని జీఅండ్‌జీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌తో భాగస్వామ్యమైన టోక్యో యూనివర్శిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీకి చెందిన ప్రొఫెసర్లు నిట్ క్యాంపస్‌ను సందర్శించారు. ప్రొఫెసర్లు అకినోరి, హిరోకి, మియాసాకి, జీఅండ్‌జీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో గౌరీశంకర్ క్యాంపస్‌ను సందర్శించిన బృందంలో ఉన్నారు. ఎనర్జీ, ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో కలిసి పని చేయడానికి జీఅండ్‌జీ గ్రూప్ ఇప్పటికే ఎన్ఐటీతో ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. నిట్‌ను సందర్శించిన బృందానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

సారు.. మీరు వెళ్లొద్దు..

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడి కాళ్లు పట్టుకుని కన్నీరుమున్నీరైన విద్యార్థులు

నెల్లికుదురు, జూలై 8 : 'సార్.. మీరు మా పాఠశాలను వదిలి వెళ్లొద్దు.. ఇక్కడే ఉండాలి' అంటూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు రంజాన్ కాళ్లు పట్టుకుని విద్యార్థులు కన్నీరు పెట్టిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. నెల్లికుదురు మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సోమవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రంజాన్, శ్యాంసుందర్, మానస, శ్రీధర్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయుడు రంజాన్ విద్యార్థులకు వెళ్తొస్తా అని చెప్పగానే ఒక్కసారిగా విద్యార్థులందరూ ఆ ఉపాధ్యాయుడి కాళ్లపై పడి మీరిక్కడి నుంచి వెళ్లొద్దు.. మా పాఠశాలలోనే ఉండాలంటూ కన్నీరు పెట్టుకుని ప్రాధేయపడ్డారు. ఆ తర్వాత ఉపాధ్యాయుడు వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడి కాళ్లపై పడి వెళ్లొద్దంటూ ప్రాధేయపడుతున్న విద్యార్థులు

విద్యుఘాతంతో ఏడు పాడి గేదెలు మృతి

విద్యుఘాతంతో మృతి చెందిన గేదెలు

మహదేవపూర్, జూలై 8: విద్యుఘాతంలో ఏడు పాడి గేదెలు మృతి చెందాయి. బాధిత రైతుల కథనం ప్రకారం.. మండలంలోని బెగ్లూరు గ్రామానికి చెందిన జక్కు భూమయ్య, ఎలకుచ్చి మహేశ్, గాయ శ్రీనివాస్, కారు మల్లయ్య, చల్ల రాజయ్యతో పాటు మరో ఇద్దరి రైతుల గేదెలు గ్రామ సమీపంలో వ్యవసాయ క్షేత్రంలోకి మేత కోసం వెళ్లాయి. అక్కడ తెగిపడి ఉన్న విద్యుత్ తీగలకు తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో సుమారు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తమకు తగిన నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బర్రె పొడిచి వ్యక్తి మృతి

వర్ధన్నపేట, జూలై 8: బర్రె పొడిచి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వర్ధన్నపేటలో సోమవారం జరిగింది. మృతుడి కూతురు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణానికి చెందిన తోట జనార్ధన్(59) గ్రామానికి చెందిన రైతు సోమేశ్వర్‌రావు వద్ద బర్లకాపరిగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలోనే ఈనెల 6వ తేదీన మేత కోసం తోలుకుపోతుండగా బర్రెలు ఒక్కసారిగా జనార్ధన్ మీదకు వచ్చాయి. ఒక బర్రె కొమ్ములతో అతడి కడుపులో బలంగా కుమ్మింది. దీంతో అతడు కిందపడిపోయి అపస్మారక స్థితికి చేరడంతో స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. దీంతో కుమార్తె దీప్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్షేమంగా ఇంటికి చేరిన ప్రకాశ్

ప్రకాశ్ వద్ద వివరాలు సేకరిస్తున్న బయ్యారం సీఐ రవికుమార్

బయ్యారం, జూలై 8 : కాంబోడియాలో సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి చిత్ర హింసలు అనుభవించిన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లికి చెందిన మున్సిఫ్ ప్రకాశ్ సోమవారం క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు. నాలుగు నెలల క్రితం ఆస్ట్రేలియాకు వెళ్లాలనుకున్న ప్రకాశ్ ట్రావెల్ ఏజెన్సీ మోసంతో కాంబోడియాకు చేరుకొని అక్కడ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నాడు. అయితే జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, మాజీ ఎంపీ మాలోత్ కవిత చొరవతో అతడు తిరిగి ఇంటికి చేరుకున్నాడు. వస్తాడో, రాడో అని రెండు నెలలుగా ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులు ప్రకాశ్‌ను చూసి భావోద్వేగానికి లోనయ్యారు. ఇంటికి చేరుకున్న ప్రకాశ్ స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎస్పీతో పాటు స్థానిక సీఐ రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపాడు . ఈ సందర్భంగా ప్రకాశ్ మోస పోయిన తీరును సీఐ అడిగి తెలుసుకున్నారు.

చైర్మన్ల నియామకంలో ఉమ్మడి జిల్లాకు పెద్దపీట

- ఐదుగురికి అవకాశం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హనుమకొండ, జూలై 8 : కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాకు పెద్ద పీట వేసింది. వివిధ కార్పొరేషన్ చైర్మన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత ఎండీ రియాజ్‌ను తెలంగాణ స్టేట్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా నియమించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యను తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా, జంగా రాఘవరెడ్డిని తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవరీస్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమించారు. ఇనుగాల వెంకట్రాంరెడ్డిని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్‌గా, తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా భూపాలపల్లికి చెందిన అయిత ప్రకాశ్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

భెల్, ఓడీఎఫ్‌లకు గ్రహణం

వాణిజ్య

- కేంద్రం నుంచి ఆర్డర్లు కరువు
- ఇలాగే కొనసాగితే ఖాయిలానే అంటున్న కార్మిక సంఘాలు
- కేసీఆర్ చేయూతతో ఊరట
- కంపెనీల్లో కొత్త రిక్రూట్‌మెంట్ బంద్‌పెట్టిన బీజేపీ ప్రభుత్వం

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని కార్పొరేషన్‌గా మార్చిన మోదీ సర్కారు

ఆత్మనిర్భర్ భారత్ అంటూ గొప్పలకు పోయే మోదీ సర్కారు.. కీలక ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నది.

సంగారెడ్డి జిల్లాలో మూడు ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలున్నాయి. రక్షణ రంగానికి సంబంధించి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, బీడీఎల్ పరిశ్రమలుండగా.. వీటితోపాటు బీహెచ్ఈఎల్ ఉన్నదీ ఇక్కడే.

ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు వీటిని స్థాపించారు. అయితే నరేంద్ర మోదీ ఆ పదవిలోకి వచ్చాక ఇవి నిర్వీర్యమైపోతున్నాయి. నష్టాలబాటపట్టి ఉద్యోగులు, కార్మికుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అయినప్పటికీ గత పదేండ్లలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రభుత్వం తరపున ఆర్డర్లిస్తూ ఆదుకున్నారు.

సంగారెడ్డి, జూలై 8 (నమస్తే తెలంగాణ): నరేంద్ర మోదీ దేశ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలకు గ్రహణం పట్టుకున్నది. ప్రైవేటీకరణ పేరుతో సర్కారీ కంపెనీలు కుదేలయ్యాయి. తెలంగాణ విషయానికే వస్తే.. సంగారెడ్డి జిల్లాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ (ఓడీఎఫ్), భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) పరిశ్రమలు అధోగతి పాలయ్యాయి. కేంద్ర ప్రభుత్వ చిన్నచూపుతో కొత్త ఆర్డర్లు లేక నష్టాల్లోకి జారుకున్నాయి. ఉద్యోగాలు లభించక యువత ఇబ్బందులు పడుతున్నది.

కార్పొరేషన్ పరిధిలోకి ఓడీఎఫ్

సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ గ్రామ పరిధిలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉన్నది. గతంలో భారత ప్రభుత్వ రంగ సంస్థగా ఉండేది ఇది. క్షిపణులు, యుద్ధ ట్యాంకులు, మైన్ ప్రూఫ్-బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు తయారయ్యేవి. మిలటరీ అవసరాలకు కేంద్రం ఓడీఎఫ్‌కు వరుసగా ఆర్డర్లు ఇచ్చేది. అయితే మోదీ సర్కారు దీన్ని కార్పొరేషన్ పరిధిలోకి తీసుకువచ్చింది. ఆర్మ్‌డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్ (ఏవీఎన్ఎల్)లోకి చేర్చారు. దీంతో ఆర్డర్లు తగ్గిపోయాయి. గతంలో ఓవర్ డ్యూటీలు చేసే కార్మికులు.. ఇప్పుడు పనిలేక ఉన్న కొలువులు ఎక్కడ ఊడిపోతాయోనన్న భయంతో బతికేయాల్సి వస్తున్నది. ఆర్డర్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరితే ఓపెన్ టెండర్లలో పాల్గొని తెచ్చుకోవాలంటూ సూచిస్తోంది. దీని వెనుక కంపెనీని ప్రైవేట్‌పరం చేయాలన్న కుట్ర ఉందన్న విమర్శలు వస్తున్నాయి. 3 వేల మంది కార్మికులు, వారి కుటుంబాల భవిష్యత్తు అంధకారంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జిల్లాలోని భానూరులో బీడీఎల్ పరిశ్రమ ఉన్నది. దీనికీ కేంద్ర ప్రభుత్వం మొండిచెయ్యే చూపిస్తున్నది. ప్రైవేటీకరించే దిశగా అడుగులు పడుతున్నాయి. దీన్ని వ్యతిరేకిస్తూ ఇటీవలే కార్మికులు ఆందోళన సైతం చేశారు.

భెల్‌కు ఆర్డర్లివ్వని కేంద్రం

సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురంలో బీహెచ్ఈఎల్ ఉన్నది. దీన్ని ప్రైవేట్‌పరం చేసే కుట్రను మోదీ ప్రభుత్వం పన్నుతోందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 5 వేల మంది కార్మికులు భెల్‌లో పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమలో గ్యాస్ టర్బైన్లు, ఆయిల్ రిగ్గులు, కంప్రెషర్లు, బాయిలర్లు, హీటర్లు, భారీ పంపులు తయారవుతాయి. మోదీ గద్దెనెక్కిన తర్వాత ప్రభుత్వ ఆర్డర్లు కరువయ్యాయి. వేలాది కోట్ల రూపాయల లాభాలను ఆర్జించిన బీహెచ్ఈఎల్.. నష్టాల బాటపట్టింది.

ఓడీఎఫ్‌లో తయారైన యుద్ధ ట్యాంకును సంగారెడ్డి జిల్లా కంది మండలం మల్కాపూర్ చెరువులో పరీక్షిస్తున్న ఇంజినీర్లు (ఫైల్) (ఇన్‌సెట్)సంగారెడ్డి జిల్లాలోని బీహెచ్ఈఎల్

కేసీఆర్ చొరవతో..

మూడేండ్ల క్రితం అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేయూతనివ్వడంతో ప్రస్తుతం భెల్ లాభాలను ఆర్జిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన పంపుల ఆర్డర్లను బీహెచ్ఈఎల్‌కే ఇచ్చారు. అలాగే తెలంగాణలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్తు ప్రాజెక్టులకు సంబంధించి మిషనరీ ఆర్డర్ కూడా దక్కింది. బీహెచ్ఈఎల్ మనుగడకు నాటి సీఎం కేసీఆర్ నిర్ణయాలే కారణమని కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి ప్పుడు. మొత్తానికి ప్రధాని మోదీ ఆత్మనిర్భర్ భారత్ అంటూ ప్రైవేట్ కంపెనీలకు పెద్ద పీట వేస్తున్నారని కార్మిక నాయకులు మండిపడుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ రంగ సంస్థలు మూతబడేలా చేస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు.

బెంజ్ ఎంట్రీలెవల్ ఈవీ కారు

ప్రారంభ ధర రూ.66 లక్షలు

న్యూఢిల్లీ, జూలై 8: లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్-బెంజ్..తొలిసారి లగ్జరీ కార్లను కొనుగోలు చేసేవారి లక్ష్యంగా ఎలక్ట్రిక్ ఎంట్రీలెవల్ కారును అందుబాటులోకి తీసుకొచ్చింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.66 లక్షలు. వీటితో పాటు ఐదు సీట్ల ఈక్యూబీ 350 ఎస్‌యూవీ మాడల్ ధర రూ.77.5 లక్షలు, ఈక్యూబీ 250+(ఏడుగురు) రూ.70.90 లక్షల ధర కలిగిన మాడళ్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది చివర్లో ఈక్యూఎస్ మేబ్యాక్ ఎస్‌యూవీ, జీ-క్లాస్ మాడళ్లను సైతం ఈ ఏడాది చివర్లో ఈవీ విభాగంలో విడుదల చేయనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. వీటి ధర రూ.3 కోట్లు ఉండనున్నట్లు చెప్పారు.

హెచ్‌డీఎఫ్‌సీ రుణాలు ప్రియం

వడ్డీరేట్లను 10 బేసిస్ పాయింట్లు పెంచిన బ్యాంక్

హైదరాబాద్, జూలై 8: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరోసారి వడ్డీరేట్లను పెంచింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని 10 బేసిస్ పాయింట్లు పెంచడంతో రుణ గ్రహీతలపై అదనపు భారం పడనున్నది. దీంతో ఎంసీఎల్ఆర్ రేటు 9.05 శాతం నుంచి 9.40 శాతం మధ్యలోకి చేరింది. పెరిగిన రేట్లు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఒక్కరోజు కాలపరిమితి రుణాలపై వడ్డీరేటుని 10 బేసిస్ పాయింట్లు పెంచడంతో వడ్డీరేటు 8.95 శాతం నుంచి 9.05 శాతానికి చేరుకున్నది. అలాగే నెల కాల పరిమితితో రుణాలపై వడ్డీ 9 శాతం నుంచి 9.10 శాతానికి పెరగగా..మూడు నెలల రుణాలపై వడ్డీరేటు 5 బేసిస్ పాయింట్లు సవరించడంతో రేటు 9.15 శాతం నుంచి 9.20 శాతానికి చేరుకున్నది. ఆరు నెలల రుణాలపై రేటు 9.30 శాతం నుంచి 9.35 శాతానికి చేరుకోగా, ఏడాది రుణాలపై రేటు 9.30 శాతం నుంచి 9.40 శాతానికి సవరించింది. రెండేండ్లు, మూడేండ్ల రుణాలపై రేటుని 9.40 శాతానికి సవరించింది బ్యాంక్. వీటితో పాటు బ్యాంక్ బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటుని 17.90 శాతానికి, బేస్‌రేటుని 9.40 శాతానికి పెంచింది.

హైదరాబాద్‌లో సీ1 విస్తరణ

మరో 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఆఫీస్

హైదరాబాద్, జూలై 8: అమెరికాకు చెందిన ఐటీ సేవల సంస్థ సీ1..హైదరాబాద్‌లో గ్లోబల్ ఇన్నోవేషన్ అండ్ కేపబిలిటీ సెంటర్(జీఐసీసీ)ని మరింత విస్తరించింది. గతేడాది 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన కార్యాలయానికి అదనంగా మరో 20 వేల చదరపు అడుగుల కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించింది. సత్వ నాలెడ్జ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 600 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఈ సంఖ్యను మరింత పెంచుకునే అవకాశం ఉన్నదని కంపెనీ ఎండీ, కంట్రీ హెడ్ చంద్ర బొడ్డూజు తెలిపారు. అంతర్జాతీయంగా ఫార్చ్యూన్ 500 సంస్థల్లో సగం తమ క్లయింట్లను, వీటికి ఇక్కడి నుంచే సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే పరిశోధన-అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ)ని కూడా ఏర్పాటు చేసినట్లు, దీంట్లో ప్రస్తుతం 60 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది చివరినాటికి మొత్తం సిబ్బంది సంఖ్యను వెయ్యికి పెంచుకునే అవకాశాలున్నాయన్నారు.

ఆర్బీఐ సమీక్షకు టమాట సెగ

ముంబై, జూలై 8: మార్కెట్‌లో మళ్లీ పెరుగుతున్న టమాట ధరల సెగ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు తగులుతున్నది. తగ్గినట్టే తగ్గి తిరిగి పుంజుకున్న టమాట రేట్లు.. కిలో రూ.100కు చేరువయ్యాయి మరి. దీంతో ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతున్న సెంట్రల్ బ్యాంక్.. ఇంకొన్నాళ్లు అలాగే ఉంచవచ్చన్న అంచనాలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబైల్లో కిలో టమాట రూ.90 పలుకుతున్నది. కాగా, దేశీయంగా టమాట సాగులో కర్నాటక, ఏపీల వాటానే 35 శాతంగా ఉన్నది. తగ్గని ఉష్ణోగ్రతలు, కురువని వర్షాలు.. పంటకు ఆటంకంగా మారాయి. గత ఏడాది ఫిబ్రవరి నుంచి కీలక వడ్డీరేట్లు ఎక్కడివక్కడే ఉంటున్నాయి. ద్రవ్యోల్బణం దెబ్బకు వచ్చే నెల ద్రవ్యసమీక్షల